క్లుప్తంగా

బోడపాడులో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: మార్కాపురం నుంచి మల్లంపేట వెళ్లే మార్గంలో బోడపాడు వద్ద శ్రీ కృష్ణ సేవా సమితి వ్యవస్థాపకుడు అడగా రాజగోపాల్ శుక్రవారం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం మీదుగా రోజూ ప్రయాణికులు, గ్రామస్తులు, కూలీలు రాకపోకలు సాగిస్తుంటారని, మధ్యాహ్న సమయంలో తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జి.రాజగోపాల్, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్, చైర్మన్ నాగమల్లికార్జున

తర్లుపాడు: స్థానిక సాయిబాబా మందిరం ఆవరణలో చలివేంద్రాన్ని శుక్రవారం ఆలయ చైర్మన్ ఎం.నాగమల్లికార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో పోలేపల్లి జనార్దన్, రిటైర్డు టీచర్ కె.నారాయణరెడ్డి, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, కె.పెద్దకాశిరెడ్డి, ఎం.శంకర్, కోటేశ్వరరావు, జి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మార్కాపురం: అయ్యప్పస్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని స్వామివారి ఆలయంలో అర్చకుడు రాఘవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ దంపతులు స్వామివారికి పూలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.మల్లికార్జునరావు, కార్యదర్శి పి.కృష్ణయ్య, కోశాధికారి అన్నా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రహదారిపై మురుగు



పొట్టిరెడ్డిపల్లెలో ఆర్అండ్‌బీ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

కొమరోలు: మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్టిరెడ్డిపల్లె గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారిపై మురుగు ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా సైడుకాలువలు ఏర్పాటు చేయకపోవడంతో గృహాల్లోని మురుగు రహదారిపైకి చేరుతోంది. ద్విచక్ర వాహనదారులు ఈ రహదారులపై వెళ్తూ జారి పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. పైగా మురుగు దోమలకు నిలయంగా మారి, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు క్వార్టర్లు.. ఆరు ఫుల్లులు!

- ఊరూరా పుట్టగొడుగుల్లా వెలసిన మద్యం బెల్టు షాపులు
- కంభం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 4 నెలల్లో 32 కేసులు నమోదు
- ఎక్సైజ్ అధికారుల దాడులకు వెరవని మద్యం వ్యాపారులు
- గ్రామాల్లో పూటుగా తాగి తూగుతున్న మందుబాబులు
- కాపురాలు గుల్లవుతున్నాయని మహిళల ఆవేదన



రాత్రి వేళ కంభం బస్టాండ్ ఆవరణలో బస్సుల మధ్య పడుకున్న మందుబాబు (ఫైల్)

కంభం: బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెండు తీస్తామని ప్రభుత్వ పెద్దలు చేసిన హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. అదే సమయంలో ఎక్సైజ్ అధికారులు అడపాదడపా దాడులు చేస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నా బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు ఒక్క అడుగూ వెనక్కి తగ్గడం లేదు. అధికార పార్టీ నేతల అండ ఉందన్న ధైర్యంతో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండటంతో పచ్చటి పల్లెలో చిచ్చు రాజుకుంటోంది. తరచూ ఘర్షణలు, వాహన ప్రమాదాలు చోటుచేసుకోవడంతోపాటు కాపురాలు కూడా గుల్లవుతున్నాయి. బస్టాండ్ల సమీపంలో, జన సంచారం ఉన్న ప్రాంతంలో మందుబాబుల ఆగడాలతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యక్తులు పూటుగా మద్యం సేవించి బస్టాండ్‌లో దొర్లుతున్న దృశ్యాలు తరచూ దర్శనమిస్తున్నాయి.

కోడి కూసే వేళకే ‘తీర్థం’..!

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణకు నిర్దిష్ట వేళలు ఉండేవి. కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ వ్యాపారులకు మద్యం లైసెన్సులు కట్టబెట్టడంతో వేళాపాల లేకుండా విక్రయాలు సాగుతున్నాయి. మద్యం షాపుల టెండర్ల సమయంలో 20 శాతం కమీషన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. షాపులు ప్రారంభించే సమయానికి అదికాస్తా 10 శాతానికి తగ్గించారు. ఆ తర్వాత మద్యం వ్యాపారులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో కమీషన్‌ను గత నెలలో 14 శాతానికి పెంచారు. ఒక్కో మద్యం దుకాణంలో 10 నుంచి 20 మంది వాటాదారులు ఉండటంతో కమీషన్ సరిపోవడం లేదని రూటు మార్చారు. అధిక ధరలకు విక్రయించినా లాభం ఉండదని భావించిన కొందరు వ్యాపారులు.. బెల్టు షాపులే దిక్కని నిర్ణంచుకొని ఆ దిశగా అడుగులు వేశారు. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలు అన్న తేడా లేకుండా అక్రమ మద్యం వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. పల్లెలతోపాటు మండల కేంద్రాల్లో తెల్లవారుజామున కోడి కూసే వేళకే మద్యం విక్రయాలు ప్రారంభమవుతున్నాయి.

కూటమి నేతల అండతోనే..

కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కంభంలో–5, అర్థవీడులో 3, బేస్తవారిపేటలో–4 మద్యం దుకాణాలు ఉన్నాయి. షాపులు అధిక భాగం మండల కేంద్రాల్లో ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మద్యం విక్రయించేందుకు బెల్టు షాపులు తెరిచారు. మూడు మండలాల్లో సుమారు 70కి పైగా బెల్టుషాపులు ఉన్నట్లు అంచనా. ఎక్సైజ్ అధికారులు గడిచిన నాలుగు నెలల్లో బెల్టు షాపులపై 32 కేసులు నమోదు చేసి వందల సంఖ్యలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అర్ధవీడు మండలంలోని ఓ గ్రామంలో ఆటో నుంచి భారీగా మద్యం కేసులు దింపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో నాలుగైదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు.. మండల కేంద్రాల్లో ఉదయం 5 గంటల నుంచే మద్యం అక్రమంగా విక్రయిస్తున్నా ఎందుకు కేసులు నమోదు చేయడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మద్యం అమ్ముతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేసినా తమ తనిఖీల్లో ఏమీ లేదని చెప్పడం విమర్శలకు తావిస్తోంది. కాగా అధికార కూటమి పార్టీల నాయకుల అండదండలతోనే మద్యం వ్యాపారం మూడు క్వార్టర్లు.. ఆరు ఫుల్లులు అన్నట్టు సాగుతుందన్న ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.

> **అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు**
>
> 
>
> బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, కూల్‌డ్రింక్ షాపులు, బడ్డీ కొట్లు, బెల్టు షాపులు, హోటల్స్, రెస్టారెంట్‌లలో మద్యం విక్రయాలు చేపట్టినా చర్యలు తప్పవు. ఎక్సైజ్ అధికారుల బృందం నిత్యం దాడులు నిర్వహిస్తోంది. ఇటీవల కాలంలో మూడు మండలాల పరిధిలో 32 కేసులు నమోదు చేసి 397 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నాం. గ్రామాల్లో మద్యం విక్రయాలపై నిఘా ఉంచాం.
>
> – ఎస్.కొండారెడ్డి, ఎక్సైజ్ సీఐ



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గోవా మద్యం (ఫైల్)

జోరుగా గోవా మద్యం విక్రయాలు

గిద్దలూరు నియోజకవర్గంలో గోవా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో ఎక్సైజ్ అధికారులు రెండు సార్లు దాడులు నిర్వహించి సుమారు వంద వరకు గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మరో వైపు ఆర్మీ బాటిళ్ల వ్యాపారం కొనసాగుతూనే ఉంది. గోవా నుంచి ఓ కంటైనర్‌లో మద్యం రవాణా అవుతోందని గిద్దలూరు, రాచర్ల, కంభం కేంద్రాలుగా కొందరు వ్యక్తులు గోవా మద్యాన్ని దిగుమతి చేసుకుని, ఫంక్షను, ఇతర కార్యక్రమాలకు గోవా మద్యాన్నే అధికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం.

వైభవంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు



అమ్మవారి దర్శనానికి భక్తుల క్యూ..

- భక్తులతో పులకించిన మునగపాడు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో చౌడేశ్వరీదేవి తిరునాళ్ల వైభవంగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు గురువారం రాత్రి, శుక్రవారం భక్తులు బారులు దీరారు. శుక్రవారం వేకువజామున అమ్మవారి జ్యోతి ఉత్సవాన్ని తిలకించి భక్తులు పరవశించారు. పరిసర గ్రామాల ప్రజలతోపాటు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తిని చాటుకున్నారు.

ఆకట్టుకున్న విద్యుత్ ప్రభలు

మునగపాడు చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మునగపాడు, వెలిగండ్ల, బసాపురం గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన పాటకచేరీలు ఆహూతులను అలరించాయి. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు రకాల షాపుల వద్ద సందడి నెలకొంది. కొనకనమిట్ల ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన నాయకులు

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు అన్నా రాంబాబు దిశానిర్దేశం

మార్కాపురం: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తర్లుపాడు మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. తాను నిత్యం పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గెలిచినా.. ఓడినా.. ప్రజల మధ్యే ఉంటానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ 6 పథకాలను ఆశగా చూపి, మోసపూరిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారన్నారు. అలాంటి మోసపూరిత హామీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ఇవ్వరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడే విధంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహపడాల్సిన పనిలేదన్నారు. సమావేశంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కంది ప్రమీలారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు గుమ్మా రాజేంద్రప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చెన్నకేశవులు, బొర్రయ్య, రామిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, కాశయ్య, సర్పంచ్ పల్లెపోగు వరాలు, షాజహాన్, దాసయ్య, ఎంపీటీసీ అంకయ్య, మల్లారెడ్డి, రమేష్‌రెడ్డి, వెన్నా సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏవి బాబూ..?



ప్రభపై మాట్లాడుతున్న అన్నా, ఉడుముల



విద్యుత్ వెలుగుల్లో వైఎస్సార్ సీపీ ప్రభలు

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

కొనకనమిట్ల: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని మాయ మాటలతో గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు అవేవీ అమలు చేయకుండా మరోమారు ప్రజలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. మండలంలోని మునగపాడులో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా గురువారం రాత్రి మునగపాడు, వెలిగండ్ల, బసాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై వారు మాట్లాడారు. చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఒక్క పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. గతంలో జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రతిరోజూ పండగలా ఉండేదని గుర్తు చేశారు. ప్రభలు ఏర్పాటు చేసిన మునగపాడు, వెలిగండ్ల, బసాపురం పార్టీ నాయకులను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పార్లపల్లి సిద్దానభి, పాతకోట వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, బాలపిచ్చయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గర్రె కుసుమ కుమారి శ్రీనివాసులు, భత్తుల రవియాదవ్, చంద్రశేఖర్, బసాపురం శ్రీను, సూరవరపు పెదవెంకటరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ బి-గ్రేడ్



కేక్ కట్ చేస్తున్న వెన్నా హనుమారెడ్డి తదతరులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(న్యాక్) బి–గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్లు కళాశాల చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత వెన్నా హనుమారెడ్డి శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 28 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ న్యాక్ బృందం కళాశాలలో పర్యటించి మౌలిక సదుపాయాలు, విద్యా విధానాలు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేసి బి– గ్రేడ్ ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎం రాఘవేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు కె.సురేందర్ రెడ్డి, సీహెచ్ పుష్పలత, సత్యవాణి, ఎస్‌కే నసీమ, గంగరాజు, గోల్డ్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మార్కాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. క్వింటా కందులకు రూ.7,550, శనగలకు రూ.5,650 మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, పీఏసీఎస్ రమాదేవి, కాశయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ **కొనకనమిట్ల:** మండలంలోని నాగరాజుకుంట గ్రామంలో కందులు, శనగలు, మినుముల కొనుగోలు కేంద్రాన్ని జేడీఏ శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

మార్కాపురం టౌన్: రాజ్యలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆలయంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి గజవాహనంపై రాజ్యలక్ష్మి అమ్మవారిని మహిళా సేవాసంఘం ఆధ్వర్యంలో నాలుగు మాఢ వీధుల్లో ఊరేగించారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, వేణుగోపాలచార్యులు, రంగాచార్యులు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న మహిళా భక్తులు

నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి–2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. శనివారం నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రభుత్వం అందించిన సమయం ప్రకారం క్లాసులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లోనూ ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించి ఒంటిపూట బడులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులు తమను రెగ్యులర్ చేయాలని కోరారు. పట్టణంలోని నరవ రోడ్డులో గల సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గిద్దలూరు జోన్ ప్రాంతీయ విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సభలో ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌ల నగదు, మెడికల్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, జిల్లా ఉపాధ్యక్షుడు టి.సుబ్బారాయుడు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, శ్రీధర్‌శర్మ, దేవప్రకాశం, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు మార్తాల బాలిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఎంకే బేగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోని శ్రీకృష్ణయాదవ అన్నదాన సేవా సంస్థ అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని కమిటీ అధ్యక్షుడు పిన్నిక హరికుమార్ యాదవ్ కోరారు. శుక్రవారం సత్రం ఆవరణలో నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్రంలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్నట్లు వెల్లడించారు. కమిటీ సభ్యులు మోడీ ఆంజనేయులు సహకారంతో 21న రాత్రికి చెంచులక్ష్మి పౌరాణిక నాటకం, 22న రాత్రికి పాట కచేరి ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పలువురు దాతలు సత్రం అభివృద్ధికి విరాళాలు అందించారు. సమావేశంలో అన్నదాన కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ మాదాల బ్రహ్మయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పుటూరి పెదవెంకటయ్య, పిన్నిక నాగేశ్వరరావు, పిన్నిక కొండయ్య, పిన్నిక చక్రపాణి, నంబుల లక్ష్మయ్య, నాగం వెంకటేశ్వర్లు, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, పిన్నిక వెంకటేశ్వర్లు, నంబుల వెంకటేశ్వర్లు, కాశీరాజు, పిన్నిక శివ, బత్తుల అల్లూరయ్య, సంపతి నాగయ్య పాల్గొన్నారు.



సత్రం అభివృద్ధికి విరాళం అందిస్తున్న దాతలు

నేడు ఎంజీ బ్రదర్స్ ఇఫ్తార్ విందు

కంభం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఎంజీ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షకులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఎంజీ బీఈడీ కళాశాలల కరస్పాండెంట్ ఎంఏ గఫార్ అలీఖాన్ తెలిపారు. మండలంలోని ముస్లింలు హాజరై ఇఫ్తార్ విందు స్వీకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.